మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

● కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ప్రభుత్వ శాఖల అధికారులతో ఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్, హాజరైన అధికారులు

కర్నూలు : మాదకద్రవ్య రహిత జిల్లాగా కర్నూలును తీర్చిదిద్దుదామని ఎస్పీ బిందు మాధవ్ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మాదక ద్రవ్యాల నిషేధం (యాంటీ నార్కోటిక్)పై శుక్రవారం సాయంత్రం కో ఆర్డినేషన్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ శాంతకుమారి, వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, అటవీ శాఖ అధికారి విజయ్‌కుమార్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ నాగప్రసాద్, విద్యాశాఖ అధికారి శామ్యూల్, ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ సుధారాణి, డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కైక, ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంఓ కిరణ్‌కుమార్, డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్ బాబు ఇతర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే యువత మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోకుండా చైతన్య పరచాలన్నారు. ఇందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, పంట పొలాలు, గ్రామీణ అటవీ ప్రాంతాల్లో కూడా అన్ని శాఖల సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాల ఉత్పత్తి వాడకం వివరాలు తెలిస్తే డయల్ 100కు ఫిర్యాదు చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

క్లుప్తంగా

కోట్ల విజయభాస్కరరెడ్డికి నివాళి


కోట్ల ఘాట్ వద్ద మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, నాయకులు

కర్నూలు(సెంట్రల్/న్యూసిటీ): జిల్లా ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని హంద్రీ నది ఒడ్డున ఉన్న ఆయన ఘాట్‌పై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

రాజకీయాల్లో అవినీతి మచ్చలేని నాయకుడు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి అని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం కోట్ల వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు కోట్ల ఘాట్‌లో ఆయనకు నివాళులర్పించారు. అనంతరం పాత కంట్రోల్ రూమ్ సమీపంలోని ఆయన కాంస్య విగ్రహానికి పూల మాలలు వేశారు. తరువాత పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఉంచి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకరబాబు, జిలానీబాషా, దామోదరం రాధాకృష్ణ, పీజీనరసింహులు యాదవ్ పాల్గొన్నారు.

వీఆర్వోల సమస్యలు తీర్చండి

కర్నూలు(సెంట్రల్): గ్రేడు–2 వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ వీఆర్వో గ్రేడు–2 అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, జిల్లా కోశాధికారి కుమార్ యాదవ్ అధికారులను కోరారు. శుక్రవారం కొత్తగా కలెక్టరేట్ ఏఓగా బాధ్యతలు చేపట్టిన ఐ.విజయశ్రీకి సంఘం తరపున శుభాకాంక్షలు తెలిపారు. వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా గ్రేడు–2 వీఆర్వోల ప్రొబేషన్ డిక్లేర్, వీఆర్వో గ్రేడ్–1 పదోన్నతుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, సోమన్న, ఖాజాబాషా, మద్దిలేటి పాల్గొన్నారు.

కలెక్టర్ సీసీగా శాలీబాషా

కర్నూలు(సెంట్రల్) : కలెక్టర్ సీసీగా హైకోర్టులో లైజన్ ఆఫీసరుగా పనిచేస్తున్న శాలీబాషాను నియమించారు. ఇప్పటికే కలెక్టర్ సీసీలుగా ప్రీతమ్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. శాలీబాషాతో కలుపుకుని కలెక్టర్‌కు ముగ్గురు సీసీలు ఉంటారు.

దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): నివాస పరిసరాల్లో దోమలు పెరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం నగరంలోని ముజఫర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చెంచునగర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇళ్లు, పరిసరాల్లోని పాత్రల్లో ఉన్న నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువరోజులు డ్రమ్ములు, తొట్లలో, ఇతర పాత్రల్లో నీరు నిల్వ ఉంచుకోవద్దని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ఆరోగ్య కార్యకర్త రమణమ్మ, మహిళా పోలీస్ సుజాత, లలిత, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఈఈగా బాధ్యతల స్వీకరణ

కర్నూలు సిటీ: చిన్న నీటిపారుదల శాఖ కర్నూలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా జి.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీశైలం డ్యాం నిర్వహణ విభాగంలో ఈఈగా పని చేస్తున్న ఈయన జల వనరుల శాఖ చేసిన ఇంజినీర్ల బదిలీల్లో కర్నూలుకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈఈగా పని చేస్తున్న రెడ్డి శేఖర్ రెడ్డి పుల్లారెడ్డి నూతన ఈఈ శ్రీనివాసులుకు బాధ్యతలు అప్పగించి అభినందనలు తెలిపారు. అనంతరం చిన్న నీటిపారుదల శాఖ కర్నూలు డివిజన్ పరిధిలోని డీఈఈ, ఏఈఈలు, డివిజన్ ఆఫీస్ సిబ్బంది కొత్త ఈఈని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఇందులో డీఈఈలు చెన్నకేశవ నాయక్, సురేష్, జిలానీ బాషా, నాగరాజు, కేసీ కెనాల్ డీఈఈ రఘురామిరెడ్డి, ఏఈఈలు వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

ధైర్యంగా ఉండండి

కర్నూలు(సెంట్రల్): ఇటీవల నగరంలోని ధర్మపేటలో హత్యకు గురైన యువతి అనురాధ కుటుంబాన్ని శుక్రవారం ఉదయం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అనంతరత్నం, లాసరస్, సుంకన్న పాల్గొన్నారు.

సమస్యలపై ఉద్యమిస్తాం

కర్నూలు సిటీ: మున్సిపల్ పాఠశాలల టీచర్ల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆ సంఘం నాయకులు శుక్రవారం డీఈఓ ఆఫీస్ ఏడీ శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. 3,4,5 తరగతులు హైస్కూళ్లలో విలీనం చేసి స్కూల్ అసిస్టెంట్ టీచర్లను నియమించలేదన్నారు. కావున ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని,అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓలుగా పదోన్నతులు ఇవ్వాలన్నా రు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి ఉన్నారు.

విద్యార్థి జీవితంలో ఇంటర్ కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వృత్తివిద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి

కర్నూలు సిటీ: విద్యార్థి జీవితంలో ఇంటర్ కీలకమని, భవిష్యత్తును తీర్చిదిద్దుకునే దశ అని ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా వృత్తివిద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్(టౌన్ మోడల్)కాలేజీలో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ సుంకన్న అధ్యక్షతన టీచర్స్, పెరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే ఏ సమయంలో ఇంటి నుంచి కాలేజీకి వెళ్లుతున్నారు..మళ్లీ ఎప్పుడు తిరిగి వస్తున్నారు అనే విషయాన్ని పరిశీలిస్తూ ఉండాలన్నారు. అలాగే అప్పుడప్పుడు పెరెంట్స్ కాలేజీకి వెళ్లి పిల్లల చదువు గురించి అధ్యాపకులతో చర్చించాలని, పరీక్షల్లో వచ్చే మార్కులు, పిల్లలకు అందుతున్న విద్య, తదితర అంశాలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోవాలన్నారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బైపీసీ, ఎంపీసీ చదువుతున్న విద్యార్థులకు ఓ పరీక్ష నిర్వహించి, ఒక్కో గ్రూప్ నుంచి 25 మంది విద్యార్థులను ఎంపిక చేసి జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ఉచితంగా కార్పొరేట్ కాలేజీకి చెందిన వారితో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

సమగ్ర విచారణ జరిపిస్తాం

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం నుంచి మల్టీపుల్ గ్రేడింగ్ యూనిట్ యజమానికి మంత్రి టీజీ భరత్ పేరుతో బెదిరింపుల విషయంపై సమగ్ర విచారణ జరిపిస్తామని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సెక్రటరీ మాట్లాడుతూ తాను కొద్ది రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించానని.. ఆ యూనిట్ గురించి ఎలాంటి సమాచారం లేదన్నారు. ఆయనను ఎవ్వరు కూడా కమిటీ కార్యాలయానికి బలవంతంగా తీసుకురాలేదని స్పష్టం చేశారు. యూనిట్ యజమానితో మాకు కొన్ని సమస్యలు ఉన్నాయని, ఇందులో జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కాటాదారులు కోరారని, అయితే నాలుగు రోజుల క్రితమే విధుల్లో చేరినందున అన్ని విషయాలు తెలుసుకున్న తర్వాత మాట్లాడుదామని చెప్పినట్లు తెలిపారు. మంత్రి భరత్ పేరుమీద బెదిరించాల్సిన అవసరం మార్కెట్ కమిటీలో ఎవ్వరికి లేదని, దీనిపై సమగ్రంగా విచారణ జరపాలని 4వ పట్టణ పోలీసులను కూడా కోరుతామని పేర్కొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీ రైతు సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద రూ.20వేల పెట్టుబడి సాయాన్ని తక్ష ణమే ఇవ్వాలని కోరారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. 2023 ఖరీఫ్, రబీల్లో పంటలు నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వకుండా కూటమి సర్కారు మీన మేషాలు లెక్కిస్తోందన్నారు. ప్రభు త్వం సాయం లేకపోవడంతో అన్నదాతలు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కర్నూ లు జిల్లా ఓర్వకల్ మండలం పిన్నాపురం గ్రామంలో గ్రీన్ కో కంపెనీ రైతుల అనుమతి లేకుండా వారి వేసిన పంటలను నాశనం చేసి భూసేకరణ చేస్తుందని, సదరు కంపెనీపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన పలువురు అధికారులు


కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న గనుల శాఖ డీడీ

కర్నూలు(సెంట్రల్) : కలెక్టర్ పి.రంజిత్‌బాషాను శుక్రవారం పలువురు అధికారులు కలిశారు. ఇటీవల వివిధ జిల్లాల నుంచి అధికారులు బదిలీలపై కర్నూలుకు వచ్చారు. వీరు మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిసి బొకేలు అందజేసి తమ శాఖల్లోని ప్రగతిని వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డీటీసీ ఎస్.శాంతకుమారి, గనుల శాఖ డీడీ పి.రవిచంద్, పీఆర్ ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, వయోజన విద్య డీడీ కె.చంద్రశేఖరరెడ్డితో పాటు సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కొంకతి లక్ష్మీనారాయణ ఉన్నారు.

29న వరల్డ్ హార్ట్ డే కార్యక్రమాలు



కేక్ కట్ చేస్తున్న మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): ఈ నెల 29వ తేదీన వరల్డ్ హార్ట్ డే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజి ప్రొఫెసర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆసుపత్రిలోని కార్డియాలజి విభాగంలో కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత 20 ఏళ్లకు పైగా నిరంతరాయంగా సీఎంఈలు, వరల్డ్ హార్ట్ డే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ 29వ తేదీన మధ్యాహ్నం ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నామని, ఇందులో తిరుపతికి చెందిన సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ డి. రాజశేఖర్ హాజరై విద్యాబోధన చేస్తారన్నారు. అనంతరం సాయంత్రం కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో హార్ట్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంగీత విభావరి కార్యక్రమం ఉంటుందని, దీంతో పాటు అనంతపురానికి చెందిన డాక్టర్ హరిప్రసాద్‌చే హాస్యవల్లరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కార్డియాలజి ఇన్‌చార్జ్ హెచ్ఓడీ డాక్టర్ లక్ష్మీబాయి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ బిందు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఎల్లార్తి

● రేపటి నుంచి ఉరుసు ప్రారంభం

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. ఈనెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు స్వామి వార్ల ఉరుసు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి కుల,మతాలకు అతీతంగా భక్తులు భారీగా తరలివస్తారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్ నేతృత్వంలో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ బాలనరసిహులు తెలిపారు. ఇక ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఎల్లార్తికి ఇలా చేరుకోవచ్చు..

కర్నూలు నుంచి ఆలూరు మీదుగా ఎల్లార్తికి 127 కి.మీ దూరం ప్రయాణించాలి. ఆదోని మీదుగా 131 కి.మీ ఉంటుంది. హొళగుంద నుంచి 9 కి.మీ, ఆలూరు నుంచి 19 కి.మీ దూరంలో ఎల్లార్తి గ్రామం ఉంది.గుంతకల్, గుత్తి తదితర ప్రాంతాల వారు ఆలూరు మీదుగా ఎల్లార్తి చేరుకోవచ్చు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి, శిరుగుప్ప తదితర పట్టణాల వారు హొళగుంద మీదుగా చేరుకోవచ్చు. ఎల్లార్తికి ఆర్టీసీ బస్సు సౌకర్యలతో పాటు ప్రైవేటు వాహనాలు తిరుగుతాయి.

ఘనంగా ఏఎన్నార్ శత జయంతి ఉత్సవాలు ప్రారంభం


ఏఎన్నార్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు, నృత్యం చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్ : టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో సీక్యాంప్ కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహించే నటసామ్రాట్, పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా కళాక్షేత్రం సభ్యులు ఏఎన్నార్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఏఎన్నార్ శత జయంతిని పురస్కరించుకొని మొదటి రోజు నృత్య నీరాజనంతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించామన్నారు. ఏఎన్ఆర్ నటునిగా, హీరోగా కొన్ని వందల పాత్రలు ధరించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు తెలుగు సినిమా రంగం తరలి రావడానికి ఎంతో కృషి చేశారన్నారు. అక్కినేని సినిమాల్లోని పాటలకు డ్యాన్స్ మాస్టర్ కరీముల్లా శిష్య బృందం, డ్యాన్స్ మాస్టర్ రామకృష్ణ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు, కళాకారులు సంగా ఆంజనేయులు, బీవీ ప్రకాష్‌ల డ్యాన్స్‌లు అలరించాయి. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు ఇనాయతుల్లా, రాజారత్నం, బాల వెంకటేశ్వర్లు, వన్నెం బలరాం, శ్రీనివాసరెడ్డి, క్రిష్టఫర్, లక్ష్మీకాంతరావు, తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ కమిషనర్‌గా ఆర్‌జీవీ కృష్ణ బాధ్యతల స్వీకరణ



కర్నూలు (టౌన్): నగరపాలక అదనపు కమిషనర్‌గా ఆర్‌జీవీ కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రేటర్ విశాఖ పట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో జోనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఇటీవలే కర్నూలుకు బదిలీ చేసింది. దీంతో నగరపాలక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి అనంతరం నగర మేయర్ బీవై.రామయ్య, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు. అలాగే నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ నగర మేయర్‌ను చాంబర్‌లో కలిశారు. అలాగే ఎమ్మిగనూరు మున్సిపాలీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తు నగరపాలకకు బదిలీపై వచ్చిన డీఈఈ మనోహర్ రెడ్డి మేయర్, కమిషనర్, ఎస్ఈ రాజశేఖర్‌ను కలిశారు.

స్పోర్ట్స్

విజేతలుగా తిరిగి రండి

కర్నూలు (టౌన్): ఈనెల 28 నుంచి 30 వరకు పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్–17 బాలుర, బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా తిరిగి రావాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రాష్ట్ర పోటీల్లో పాల్గొంటున్న జట్టును ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పాల్ విజయ్‌కుమార్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

29న ఉమ్మడి జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్

కర్నూలు (టౌన్) : ఈనెల 29 వ తేదీ ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 100 మీటర్లు, 800 మీటర్లు, 5 కి.మీ వాక్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో తదితర క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోటీలు ఉంటాయని తెలిపారు. వివరాలకు సెల్: 9885578905 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

ఓర్వకల్లు: కాల్వబుగ్గ గురుకుల పాఠశా ల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 26వ తేదీన కర్నూలు జిల్లా క్రీడల అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ విభాగంలో నిర్వహించిన పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ పి.ప్రసాద్‌రావు తెలిపారు. పరుగు పోటీలలో ఎస్. సంతోష్ నాయక్, అనిల్ కుమార్, ట్రిపుల్ జంప్‌లో ఎస్. రాకేష్, కె.అకిరానందన్, హమ్మర్‌త్రోలో డి. మహబూబ్‌బాషా, కె. రాజశేఖర్, డిస్కస్‌త్రో పోటీలలో పి.మిన్నెల్ల ప్రతిభచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. శ్రీకాకుళం జిలాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులతోపాటు పీఈటీ లక్ష్మినారాయణను ప్రిన్సి పాల్‌అభినందించారు.

ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు ప్రారంభం


బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డీవీఈఓ, ప్రిన్సిపాల్ సుంకన్న

కర్నూలు (టౌన్) : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి పరమేశ్వర రెడ్డి, టౌన్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న అన్నారు. శుక్రవాం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ –19 విభాగంలో వెయిట్ లిఫ్టింగ్, తైక్వాండో, క్రికెట్ పోటీలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యతో క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్, డీఎస్‌డీఓ భూపతిరావు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో సత్తా చాటాలి


పతకాలు సాధించిన జిల్లా రైఫిల్ షూటింగ్ క్రీడాకారులు

కర్నూలు (టౌన్): తూర్పు గోదావరి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్–14 అండర్–17 బాల బాలికల రైఫిల్ షూటింగ్ పోటీల్లో జిల్లా షూటర్స్ సత్తా చాటాలని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపు నిచ్చారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైఫిల్ షూటింగ్‌లో కర్నూలు షూటర్స్ మంచి ప్రతిభ చాటుతున్నారన్నారు. కార్యక్రమంలో రైఫిల్ షూటింగ్ జిల్లా కార్యదర్శి ఏఎండీ బాషా, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య నిర్వీర్యం

కర్నూలు సిటీ: రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానంతో ఉన్నత విద్య పూర్తిగా నిర్వీర్యమైందని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) రాష్ట్ర కార్యదర్శి ఎ.నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అందులో విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షలు రద్దు, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పన, ప్రైవేటు యూనివర్సిటీల రద్దుపై దృష్టి సారించాలన్నారు. నిరసన కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు రంగస్వామి, నగర నాయకులు పవన్, కిరణ్ పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిబంధనలు పాటించని బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లుకు ఆ సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఈడీ కళాశాలల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సక్రమంగా జరగలేదని దీనిపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ మౌలాలి, నాయకులు రాజు రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

క్రైం కార్నర్

పోలీసుల అదుపులో గజదొంగ

కర్నూలు : నగరంలోని వివిధ కాలనీల్లో ఇళ్ల దొంగతనాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న గజదొంగ బుడగజంగాల రమేష్‌ను నాలుగో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా దొంగతనాలకు పాల్పడుతూ చోరీ సొత్తును విక్రయించి జల్సాలు చేసేవాడు. అనుమానంపై పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి అతని నుంచి దాదాపు అరకిలో బంగారం రికవరీ చేసినట్లు సమాచారం. ఇతనితో పాటు మరో నలుగురిని అదుపులో తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

చైన్‌స్నాచర్స్ హల్‌చల్

కర్నూలు : కర్నూలు వెంకటరమణ కాలనీలో చైన్ స్నాచర్స్ హల్‌చల్ చేశారు. అమీన్ అబ్బాస్ నగర్ రైతుబజార్ వెనుక నివాసముంటున్న వృద్ధురాలు సుజాతమ్మ (62) ట్యాబ్లెట్ల కోసం శుక్రవారం ఉదయం 8:30 గంటల సమయంలో రోడ్డుపై ఉన్న మెడికల్ షాపు వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాసుకులు ధరించి ద్విచక్ర వాహనంపై ఆమెను సమీపించి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కుని ఉడాయించారు. ఆమె దొంగ దొంగ అని కేకలు వేసేలోగా వాహన వేగం పెంచి పక్క సందులో నుంచి కనిపించకుండా పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు సీఐ జి.వి.నాగరాజరావు తెలిపారు. అలాగే రామలింగేశ్వర్ నగర్‌లో నివాసముంటున్న కేశవరెడ్డి భార్య జయశ్రీ ఉదయం కిరాణ దుకాణం నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా గొలుసు దొంగలు ఆమెను సమీపించి మెడలో ఉన్న గొలుసును లాక్కునేందుకు ప్రయత్నించగా ఆమె అప్రమత్తమై కేకలు వేసేలోగా దొంగలు పారిపోయారు.

ఈ రోజు

సంపూర్ణ భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: ఏకాదశిని పురస్కరించుకొని శనివారం ఉదయం 9.30 గంటలకు సంకల్ బాగ్ లోని గీతా ప్రచార ధామంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నట్లు గీతాప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతితో ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయ కవయిత్రుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: గణేష్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నగర శివారులోని ఆర్టీసీ కాలనీలోని గణేష్ సాహితీ సదన్‌లో 7వ జాతీయ కవయిత్రుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్త తెలిపారు. సావిత్ర బాయి పూలే పేరుతో నిర్వహిస్తున్న ఈ సమ్మేళనంలో రచయిత్రులు, కవయిత్రులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్‌యూసీఈ ఫ్రెషర్స్ డే

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శనివారం సాయంత్రం 4 గంటలకు వర్సిటీ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తెలిపారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, కర్నూలు ట్రిపుల్ ఐటీడీఎం అకడమిక్ అఫైర్స్ డీన్ డాక్టర్ కొర్రసత్యబాబు అతిథులుగా హాజరు కానున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ టారిఫ్‌ల జారీ

కర్నూలు న్యూసిటీ : ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్‌సీ) నూతన టారిఫ్‌లకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. 2024–25 నుంచి 2028–29 వరకు విధించవలసిన విద్యుత్ టారిఫ్‌ల వివరాలను శుక్రవారం కమిషన్ ఆమోదించింది. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు, కరెంట్ ప్రమాదాలు నివారించేందుకు, సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అయ్యే నిధులను దృష్టిలో పెట్టుకుని కొత్త టారిఫ్‌లు ప్రకటించినట్లు కమిషన్ కార్యదర్శి ఉత్తర్వుల్లో వెల్లడించారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
I.P.No: 19/2024
కె.పాండు రంగారెడ్డి ..అర్జీదారు
-VS-
డి.వెంకటేశ్వర రెడ్డి వగైరా ..రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామము, బుధవారపేట ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై నంబరు I.P.లో అర్జీదారు అయిన కె.పాండురంగారెడ్డి, తండ్రి కేశవరెడ్డి, వ్యాపారం PLOT NO: 38 ఎండోమెంటు కాలనీ, గుత్తి రోడ్డు, కర్నూలు అనునతడు తనను దివాలా దారుగా తీర్మానించమని దివాలా అర్జీ(I.P) దాఖలు చేసినాడు. ఇందుపైన ఎవరికైన ఆక్షేపణ ఉన్న 14.10.2024తేదిన పగలు 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

పోకల శ్రీనివాసులు
అర్జీదారు పరం అడ్వకేటు, కర్నూలు
సెల్: 93938 71715.